# ప్రతీకారం

### ఇంగువ అన్నపూర్ణ

అసహనంగా పచార్లు చేస్తున్నాడు మూర్తి వసారాలో. ఆగి ఆగి చేతిగడియారం వంక చూస్తున్నాడు. వెధవ్వాన ఇలా పట్టుకుందేమిటి? డాక్టర్ ఈ పాటికి రావాలి. వాన వెలిస్తేగాని రాడేమో...

"అమ్మా..." సన్నని ఆర్తనాదం. ఆ వెనుక సన్నగా మూలుగు విన్పించాయి. గాభరాగా గదిలోకి నడిచాడు మూర్తి.

అక్కడ మంచం దగ్గర కడుపు పట్టుకుని కూచుండిపోయింది సుభద్ర. మూలుగు బైటికి రాకుండా వెంగు నోటిలో కుక్కుకుంది.

"అమ్మా" ఒక్క ఉదుటున తల్లినిచేరి ఒడిలోకి తీసుకున్నాడు మూర్తి. మెలికలు తిరిగిపోతోంది బాధతో ఆమె.

"ఏమైందమ్మా" జవాబివ్వకుండా తలొంచుకుంది సుభద్ర. మూర్తి అనుమానంగా మంచంకేసి చూశాడు. మంచం మీద కాలభైరవుడి అవతారంలో పడుకుని తీక్షణంగా చూస్తున్నాడు పాపారావు.

ఏం జరిగిందో ఊహించుకోగలిగాడు మూర్తి. తండ్రి బట్టలు పాడుచేసుకున్నాడు. అవి మార్చటంలో క్షణం జాప్యం కూడా అతడు సహించడు.

వస్తున్న కోపాన్ని బలవంతాన అణచుకుని తండ్రి మంచాన్ని సమీపించాడు మూర్తి. అతనెందుకు తన వద్దకు వచ్చింది గ్రహించిన పాపారావు

"నీ డ్యూటీ కాదిది నువెళ్ళు అవతలకి ఏమే దొంగముండా అయ్యాయా దొంగవేషాలు? త్వరగా బట్టలు మార్చాలని తెలీదా?... "ఇంకా ఆగితే మరేం వినార్సి వస్తుందోనని హడలిపోతూ కడుపు పట్టుకుని అలానే లేవబోయింది సుభద్ర. లోపల కలుక్కుమంది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

మూర్తి నిల్చున్న చోటునుంచి కదల్లేదు. తన కన్నతల్లిని తన కళ్ళముందే బూతులు తిడుతున్న తండ్రిని ఎలా శిక్షించాలో తెలియటంలేదు. అప్రయత్నంగా అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"ఆం.. కొడకా నువ్వెందుకురా ఇంకా ఇక్కడే వచ్చావ్? అవతలికి తగలడు. నీ వెధవమొహం చూపించకు... నేను ఎప్పుడు పోతానా అని ఇద్దరూ ఎదురు చూస్తున్నారు... నేను చస్తే పీడా విరగడౌతుందని అనుకుంటున్నారు..."

"ఎందుకండీ అంతలేసి మాటలంటారు? ఇప్పుడు మీకు మేమేం తక్కువ చేసామని?" ఉతికిన పంచె అతనికి చుట్టబెట్టి విడిచిన పంచె ప్లాస్టిక్ బక్కెట్లో పడేస్తూ అన్నది సుభద్ర బాధగా.

"దొంగముండా మాటకు ఎదురు చెప్తావా? నేను మంచాన పడేసరికి నీకు బాగా నోరొచ్చిందే దొంగముండా.. మళ్ళీ కాలు విసరబోయాడు పాపారావు. అంతవరకు జడపదార్థంలా స్తబ్దుగా నిలబడ్డ మూర్తి చెప్పరిల్లి వాయువేగాన్ని మించిన వేగంతో హఠాత్తుగా తల్లిని పక్కకు లాగాడు. పాపారావు విసిరిన కాలు అదుపు తప్పి మంచం కోడుకు కొట్టుకుంది. బాధగా కేక పెట్టాడు పాపారావు. ప్రాణం గిలగిల్లాడింది.

తల్లిని వదలకుండా అలాగే పట్టుకున్నాడు మూర్తి. లేచి తిరగలేడు. తన అవసరాలు తీర్చుకోలేడు కాని అతని కాళ్ళల్లో అంత శక్తి ఎక్కడిదో వాళ్ళిద్దరికీ ఆశ్చర్యంగా వుంది.

"రెండేళ్ళుగా మంచాన పడి నీ చేత సేవ చేయించుకుంటున్నాడు ఆయన. కానీ ఆ మనిషి నిన్ను నీ సేవను కానీ ఏమైనా గుర్తించాడా అమ్మా! మంచం మీంచి లేవలేకపోయినా, ఏ పని చేసుకోలేకపోయినా ఇంకా అంత అహం ఏం చూసుకుని అమ్మా? ఏదైనా అవసరమైతే నేను వెళ్ళి చూస్తూ ఉంటాను. నువ్వు పడుకోమ్మా" తల్లిని తన గదికి తెచ్చి చాలా ఆవేశంగా అన్నాడు మూర్తి.

సుభద్ర ఏం చెప్తుంది, మానసికంగా శారీరకంగా ఆమె చాలా అలసిపోయి వుంది. సమాధానం చెప్పకుండా కళ్ళు మూసుకుని పడుకుంది.

రెండేళ్ళుగా ఆమెకు నిద్రాహారాలులేవు. సరిగా తిండి తినే సమయానికో లేక నిద్ర పడుతున్న సమయంలోనో ఆమెను పిలుస్తాడు. భర్తకంటే నీకు తిండి, నిద్రే ముఖ్యమని సాధిస్తాడు.

**డాక్టరువచ్చి పలకరించాడు పాపారావుని. మూర్తిని బయట నిల్చోమని చెప్పి తలుపు వేసేసాడు డాక్టరు. పది నిముషాలు తర్వాత బయటకు వచ్చాడు డాక్టరు. అతని వెంట బయటకు నడిచాడు మూర్తి. సుభద్ర గదిలోకి వెళ్ళింది**

ఆరోగ్యంగా ఉన్నన్నేళ్ళు భార్య, కొడుకు అవసరం లేకపోయారు. ఆస్తి వస్తుంది కదాని మేనకోడల్ని చేసుకున్నాడు. అంద చందాల మాట అలా ఉంచితే సుభద్ర చాలా అమాయకురాలు. తన తమ్ముడైతే అమాయకురాలైన పిల్లని ఆపేక్షగా చూస్తాడని సుభద్ర తల్లి పట్టుపట్టి అతనికిచ్చి చేయించింది.

ఆ రోజు మూర్తి టెన్త్ క్లాస్ పాసయిన సందర్భంగా స్నేహితులతో సినిమాకు వెళ్ళాడు. అతని దురదృష్టం పాపారావు కూడా అదే సినిమాకు వచ్చాడు హెడ్ నర్సు పంకజంతో కల్సి. పంకజం అతని మీద మీదకు ఒరిగిపోయి వయ్యారాలు పోతోంది. మూర్తి నిశ్చేష్టుడైనాడు. ఎదుగుతున్న వయసు. తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకుని వ్యక్తిత్వాన్ని మలచుకోవాలని ప్రయత్నించే తరుణం. అలాంటి తరుణంలో ఇలాంటి దృశ్యాలు కంటబడితే బలహీన మనస్కులైన కుర్రవాళ్ళు తాము కూడా అదే బాటలో నడవాలని నిర్ణయించుకుంటారు. నాన్న చేస్తే తప్పులేదు కానీ నేను చేస్తే తప్పా అని ఎదురు ప్రశ్నిస్తారు.

తను చూసిన విషయం తల్లికి చెప్పకూడదనే జ్ఞానం ఇంకా రాని వయసు అతనిది. తల్లి స్థానంలో మరొకరు ఉండటం భరించరాని విషయం. తల్లికి తెలియజేస్తే ఏదైనా చర్య తీసుకోగలదనే ఆశ.

"నువ్వు మటుకు మీ నాన్నలా తయారవకు నాన్న" అతని తల నిమురుతూ అన్నది సుభద్ర. 'రాత్రిళ్ళు హాస్పిటల్‌లో పనెక్కువ ఉంటుంది. ఇంటికి రాను' అనే భర్త మాటల కర్థం అప్పుడు బోధపడింది.

మూర్తి స్నేహితులు మటుకు అతడ్ని బాగా చులకన చేసి మాట్లాడటం సాగించారు. తండ్రి కారణంగా తనకు జరిగే అవమానాలు భరించలేక ఒక రోజు తండ్రితో తెగించి చెప్పేసాడు. నీ కారణంగా నేను నవ్వుల పాలవుతున్న నలుగురిలో అని.

అప్పటికే పంకజం పాపారావుతో గొడవ పెట్టుకుంది. పంకజం కూతురికి గొలుసు చేయించి ఇస్తానని అప్పుడెప్పుడో మాట ఇచ్చాడు. అది ఈ రోజు తేకపోతే గడప తొక్కొద్దని శాసించింది పంకజం. సమయానికి చేతిలో డబ్బు సమకూరలేదు. ఎలాగా అని మథన పడుతుంటే కొడుకు మాటలకి అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది.

"దొంగ లమ్డీ కొడకా గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించినట్టు నువ్వా నాకు నీతులు చెప్పేది. ఇష్టముంటే ఇంట్లో పడుండు నోర్మూసుకుని. కష్టమయితే లేచిపో పెద్దా చిన్నా లేకుండా వాగావంటే చీరేస్తాను దొంగ గాడిదకొడకా.!"

మూర్తికి ఉక్రోషం ఎక్కువయిపోయింది. "అదొక్కటే మీకు చేతనయింది" అన్నాడు కసిగా. ఈ గొడవకి సుభద్ర గాభరాగా ముందు హాల్లోకి వచ్చింది.

"ఏం పొగరెక్కువయిందా? దింపేస్తానుండు అదేది ఆ దొంగముండ... అదే వీడిని నా మీదకు ఉసిగొల్పుతున్నది..." విచక్షణ అనేది మర్చిపోయి బెల్టుతో కొడుకునయినా చూడకుండా బాదేసాడు పాపారావు. అడ్డుకోబోయిన సుభద్రకి అదేగతి పట్టింది.

కొట్టి కొట్టి అలసిపోయి భార్య మెడలో కన్పిస్తున్న రెండు పేటల గొలుసు ఊడదీసుకుపోయాడు



పాపారావు. వయసొచ్చిన కొడుకుని స్నేహితుడుగా చూడాలంటారు. కనీసం మనిషిగా కూడా చూడవి వాడిని నాన్న అని పిలవటం కూడా పాపమే. ఆ రోజునించి అతను తండ్రితో మాట్లాడ్డం మానేసాడు.

* * *

తండ్రి గదిలోకి నడిచాడు మూర్తి. పాపారావు అతడ్ని చూస్తే తిట్లు లంకించుకోబోయి ఆగిపోయాడు. మూర్తి చేతిలో ఇస్తున్న ఉత్తరమే అందుకు కారణం. మౌనంగా ఉత్తరం అందించాడు మూర్తి. అది పంకజం రాసింది. దానిలో సారాంశం ఇది:

తనకు ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉందనీ వచ్చి సేవ చేసే స్థితిలో లేనని అదీగాక పిల్లల్ని వదిలి రాలేనని ఏమనుకోవద్దని రాసింది.

"పంకజానికి ఉత్తరం ఎవరురాశారు? నువ్వేనా?" మూర్తి మాట్లాడలేదు.

— "నిన్నే మాట్లాడవేం?"

మూర్తి సమాధానం చెప్పదలచుకోలేదు. తనువచ్చిన పని అయిపోయినట్లు గదిలోంచి వెళ్ళిపోయడు. పాపారావు ఆ అవమానాన్ని భరించలేకపోతున్నాడు. నోటికి వచ్చిన బూతులు తిడుతున్నాడు. భార్య ఎదురుగా ఉంటే జుట్టు పట్టి వొంచి కసితీరేలా కొట్టాలని ఉంది. దొంగముండ బ్రతికిపోయింది. శాపనార్థాలు పెడుతూనే ఉన్నాడు పాపారావు.

అయినా పంకజం కేమయింది? వయసులో ఉన్నప్పుడు నీవే నా సర్వస్వం అంటూ తిరిగింది. ఆస్తి దాని పేర్న రాసేవరకూ స్వర్గం చూపించింది. కనీసం

చూడ్డానికైనా రావచ్చుకదా!

ఒకటికి వెళ్ళాల్సినట్లుంది. రావటల్లేదు... మహాబాధగా ఉంది. అప్పుడే చీకటి పడినట్లుంది. ఈ డాక్టరు ఇంకెంతసేపటికి వస్తాడో వాన తగ్గినట్లుంది. కారు హారను విన్పిస్తోంది. డాక్టరు గారి గొంతు వినిపిస్తుంది.

డాక్టరువచ్చి పలకరించాడు పాపారావుని. మూర్తిని బయట నిల్చోమని చెప్పి తలుపు వేసేసాడు డాక్టరు. పది నిముషాలు తర్వాత బయటకు వచ్చాడు డాక్టరు.

అతని వెంట బయటకు నడిచాడు మూర్తి.

సుభద్ర పాపారావు గదిలోకి వెళ్ళింది.

"ఎలా ఉంది కండిషను?"

"మహా ఉంటే నాలుగయిదు రోజులు. అంతే" డాక్టరు వెళ్ళిపోయాడు.

"నేనా మనిషి శవానికి తలకొరివి పెట్టను" నిక్కచ్చిగా తేల్చి చెప్పేశాడు మూర్తి.

వచ్చిన బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగువారు ముక్కున వేలేసుకున్నారు. కలికాలం అనుకుని బుగ్గలు నొక్కుకున్నారు ముసలమ్మలు.

"ఇవ్వాళ నువ్వు నీ తండ్రికి తల కొరివి పెట్టనంటున్నావు. రేపు నీ పిల్లలు నీకు చేస్తార్నుటా?"

నేను నా పిల్లల్ని అలా పెంచను అనుకున్నాడు మూర్తి. ఆ విషయం మాట్లాడే సందర్భం కాదు.

సుభద్ర మూర్తిని గదిలోకి పిలిచింది. అతని చేతులు పట్టుకుని బతిమాలుతూ ఇవి చేతులు కావనుకుంటాను నాన్నా. ఇప్పుడు పది మందిలో అప్రతిష్ట తెచ్చే పని చేయకురా, నన్ను చూసైనా శాంతించు నాయనా" అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

మూర్తి జాలిగా చూసాడు తల్లివైపు. ఛీ ఈ దేశంలో పుట్టడం ఎంత దౌర్భాగ్యం? తల్లితో వాదించే సమయం కాదు. వాదించి ఈ సమయంలో గెలవటం కష్టం. భర్తని సాధించి దారిలో పెట్టుకోవటం చేతకాని ప్రతి స్త్రీకి కొడుకుని సాధించడం బాగా చాతనవుతుంది అనుకున్నాడు మూర్తి.

మున్సిపాలిటీ వాళ్ళకి కబురు చేస్తే వాళ్ళు వచ్చి శవాన్ని తీసుకుపోతారు. అప్పటిగ్గాని తన కసి తీరదు. కానీ ఆ ప్రయత్నం చేయనిచ్చేలా లేదు తల్లి.

"దహన సంస్కారం జరిగే వరకు ఆ జీవుడి ఆత్మ శరీరం చుట్టూ తిరుగుతూనే ఉంటుందట. ఇక్కడ జరిగేవన్నీ తెలుస్తూనే ఉంటాయట" ఎవరో ముసలమ్మ పక్కనున్నావిడతో అంటున్నది.

"తండ్రి ఎలాంటి వాడయినా జన్మనిచ్చినందుకు రుణం తీర్చుకోవాలి కొడుకు.

"తలకొరివి పెట్టగానే సరా? మనసులో నిశ్చయం చేసుకున్నవాడిలా మౌనంగా లేచాడుమూర్తి.

* * *

మూడవ రోజు నిత్యకర్మ చేయించటానికి ఆ ఇంటికి వచ్చిన పురోహితుడికి విపరీతమైన సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. అప్పుడే ఇళ్ళ నుండి వస్తున్న బంధువులు కూడా అమితాశ్చర్యంగా చూశారు ఆ ఇంటి వైపు. "ఔరా కలికాలం" అంటూ ముక్కున వేలేసుకున్నారు జనం.

ముందుగా పురోహితుడు తెప్పరిల్లి లోపలికి నడిచి వసారాలో చెప్పులు విడిచి మూర్తి కోసం పిలువబోయాడు.

"రండి శాస్త్రులుగారు బాబాయి రండి... మామయ్యగారూ మీరు రండి. వచ్చి మీరు కూడా ఇలా కూర్చోండి. "అక్కడ ముందు హాలులో పాతిక ముప్పయిమంది ఎరుకల, యానాది వాళ్ళు కూర్చుని భోంచేస్తున్నారు. మూర్తి స్వయంగా వడ్డిస్తున్నాడు వాళ్ళకి.

"ఛీ... భ్రష్టుడా నిత్యకర్మ ప్రారంభించకుండా వీళ్ళందరినీ లోపల కూర్చోబెట్టి విందు ఇస్తున్నావా?" ఇంత భ్రష్టాచారం చేస్తూ మమ్మల్ని కూర్చోమంటున్నావా... సుభద్ర ఏమిటమ్మా ఈ ఘోరకలి?"

సుభద్ర గదిలోంచి ఇవతలికి రాలేదు. ఆమెకంతా అయోమయంగా ఉంది.

"అమ్మేం చెప్తుంది బాబాయి? అయినా నాకు తెలియక అడుగుతున్నాను. మా అమ్మ పుట్టింటి నుంచి తెచ్చిన ఆస్తిని నగలను మా నాన్న ఉంపుడు కత్తెలకు ధారపోసిననాడు మీరంతా ఏమయ్యారు? ఒక్కరైనా ఆయనకెందుకు బుద్ధి చెప్పలేకపోయారు? మాకేమి తెలియదని బుకాయించకండి. మా నాన్న తన వ్యసనాల నెప్పుడు రహస్యంగా పెట్టుకోలేదు. పైగా అదొక ఘనకార్యంలా భావించాడు. మా తాతగారిచ్చిన సొంత ఇంటిని ప్రియురాలికి ధారాదత్తం చేసి తననే నమ్ముకుని జీవచ్ఛవంలాగా బతికిన మా అమ్మకు మిగిల్చిందేమిటి? ఈ అద్దె కొంపలో బతకవల్సి రావటమేగా?

" నా తండ్రి జన్మచేత బ్రాహ్మణుడైనా కర్మ చేత ఛండాలుడు. అలాటి ఛండాలుడికి కర్మ చేయవలసిన అగత్యం నాకు లేదు."

బంధువులంతా శాపనార్థాలు పెడుతూ వెళ్ళిపోయారు.

ఆ సాయంకాలం పురోహితుడు వచ్చాడు.

"బాబూ అస్థికలు..."

"కూర్చోండి ఒక్క క్షణం" అంటూ మూర్తి పెరట్లోకి వెళ్ళాడు. రెండు నిమిషాల తర్వాత ముంత తీసుకుని బయటకు వచ్చాడు.

"పదండి" నదివైపు బయలుదేరారు ఇద్దరూ. మౌనంగా నడుస్తున్నాడు మూర్తి. చీకటిపడింది. అందరూ ఇళ్ళలోపల ఉన్నారు. బయట ఆట్టే జనం లేరు.


నడుస్తూ నడుస్తూ ఒక చోట హఠాత్తుగా ఆగిపోయాడు మూర్తి. మాట్లాడుతూ ముందు నడుస్తున్నాడు పురోహితుడు. తన ప్రశ్నకు సమాధానం రాకపోయేసరికి మూర్తికోసం వెనక్కి తిరిగాడు పురోహితుడు. మూర్తి అక్కడొక మాన్ హోల్ ఉంటే దాని దగ్గర కూర్చున్నాడు లోపలికి చూస్తూ. పురోహితుడు వెనక్కి వచ్చాడు.

"ఏం జరిగింది?"

"ఏం లేదు పదండి" చేతిలో ఉన్న ఖాళీ ముంతను ఎలక్ట్రిక్ పోల్ కేసి కొట్టి ఇంటికేసి నడిచాడు మూర్తి.

నిశ్చేష్టుడై నిలబడ్డాడు పురోహితుడు.

*






## గుడ్ న్యూస్

అప్పుడే ఆఫీసునుండి ఇంటికొచ్చాడు శాంతమూర్తి.

"ఏమండీ" కంగారుగా వచ్చింది భార్య కామాక్షి.

"ఇదిగో... ఇంటికి రాగానే నాకు బ్యాడ్ న్యూస్ లేవీ చెప్పొద్దు" విసుక్కున్నాడు శాంతమూర్తి.

"అయితే సరే... మన రెండోవాడే పరీక్ష పాసయ్యాడు" చెప్పింది కామాక్షి.

—గంటి సుబ్రహ్మణ్యశర్మ
(అమలాపురం)